పూత ఆలస్యం..

- దిగుబడులకు చేటు
- రాలుతున్న పిందెలు
- ఆందోళనలో మామిడి రైతులు


పీచర సమీపంలోని మామిడి తోటలో చెట్లకు లేటుగా వచ్చిన పూత

లక్ష్మణచాంద: ఈ ఏడాది మామిడితోటల్లో చెట్లకు పూత లేటుగా రావడంతో పాటు వచ్చిన పూత కూడా నిలవక పోవడంతో పంట దిగుబడి తగ్గుతుందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని 19 మండలాలు, 400 పంచాయతీల పరిధిలో 350 నుంచి 400 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయని జిల్లా ఉద్యానవన, సెరీ కల్చర్ అధికారి బీవీ.రమణ తెలిపారు.

రాలుతున్న పూత

ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో చివరి వరకు మామిడి పూత వస్తుంది. కాని ఈసారి వాతావరణంలో వస్తున్న మార్పులతో చాలా చోట్ల పూత ఆలస్యంగా వస్తోంది. చలి హెచ్చుతగ్గుల కారణంగా లేటుగా వచ్చిన పూతకూడా రాలుతోంది. మంచు పడటంతో పూత తరువాత పరాగ సంపర్కం జరుగక పూత నుండి పిందెలు ఏర్పడటం తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో తెగుళ్లు ఆశించి వచ్చిన పిందెలు కూడా రాలుతున్నాయని రైతులు వాపోతున్నారు. మామిడి తోటలకు సాధారణంగా రాత్రి కనీస ఉష్ణోగ్రతలు 30 డిగ్రీ సెంటీగ్రేడ్‌ల వాతావరణం ఉండాలి. కానీ ఈసారి ఏ ఒక్కరోజు కూడా ఈ పరిస్థితి లేదని అధికారులు పేర్కొంటున్నారు.

బీమా జాడేది?..

గతంలో మామిడి రైతులకు బీమా సౌకర్యం ఉండేది. కానీ కొన్ని సంవత్సరాలుగా దీనిని అమలు చేయడం లేదు. ప్రతీ సంవత్సరం బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించే వారు. కానీ ప్రస్తుతం ఆ ఊసే కనిపించడం లేదు. దీనిపై అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్ల నివారణకు..

పూత రాలిపోకుండా ఉండేందుకు, తెగుళ్ల నివారణకు కాన్ఫిడార్ 100 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా లీటరు నీటిలో 1 మి.లీ కాంటాప్‌ప్లస్ కలిపి పిచికారీ చేయాలి. లేదా 2 మి.లీ ప్లానోఫిక్స్‌ను 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని ఉద్యానవన అధికారులు సూచిస్తున్నారు.

లేటుగా వస్తోంది



నాకున్న ఐదెకరాల్లో మామిడి తోటను సాగు చేస్తున్నా. ఈ సారి చెట్లకు పూత లేటుగా రావడంతో పాటు వచ్చిన పూత కూడా రాలిపోతోంది. రెండోసారి వచ్చిన పూత కూడా నిలవడం లేదు. ఈ సారి దిగుబడి తీవ్రంగా తగ్గనుంది.

– బుర్రి గణేశ్, మామిడి రైతు, పీచర

పిందెలు రాలుతున్నాయి



గతంలో మాదిరి కాకుండా ఈసారి పూత లేటుగా వస్తోంది. వాతావరణం చల్లగా ఉండటంతో పిందెలు తక్కువగా వస్తున్నాయి. వచ్చిన పిందెలు కూడా నిలవడం లేదు. దీంతో సగం దిగుబడి కూడా వచ్చేలాగా లేదు.

– కొండ రవి, మామిడి రైతు, న్యూవెల్మల్

వాతావరణంలో మార్పులతోనే..

వాతావరణంలో వస్తున్న మార్పులతో ఈసారి మామిడిచెట్లకు పూత లేటుగా వచ్చింది. మామిడి రైతులు ఉద్యానవనశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. మామిడిచెట్లకు పూత, పిందెలు రాలకుండా చూసుకోవాలి.

– బీవీ రమణ, జిల్లా ఉద్యానవన, సెరీకల్చర్ అధికారి

క్లుప్తంగా

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

కుంటాల: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. బుధవారం కుంటాలలోని నర్సరీని పరిశీలించారు. వేసవికాలంలో మొక్కలు వాడిపోకుండా నీళ్లు పట్టించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో రహీం ఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. స్వచ్ఛతాహీసేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని గజ్జలమ్మ ఆలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఎంఏ రహీం ఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది రాజేశ్వర్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

మామడ: మండలంలోని లింగాపూర్ సమీపంలో ఉన్న నర్సరీ, పానికి వనాన్ని బుధవారం డీఆర్‌డీవో విజయలక్ష్మి పరిశీలించారు. కొయ్యబొమ్మల తయారీలో వినియోగించే పానికి కర్ర కోసం పెంచుతున్న మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గంగాసాగర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం అరుణ, ఈజీఎస్ ఏపీవో శివాజీ, పంచాయతీ కార్యదర్శి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

శివ దత్తసాయి ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో శివ దత్తసాయి ఆలయ వార్షికోత్సవాన్ని వీడీసీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు రాంపెల్లి రమేశ్, వెంకట్‌రెడ్డి, గంగాధర్, సాగర్, చిన్న సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

మినీ సమ్మక్క, సారలమ్మ జాతర


పూజలు చేస్తున్న భక్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండా సమీపంలో గుట్టపైన ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద బుధవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు సతీష్ రేణుకాబాయి సౌకర్యాలు కల్పించారు.

ఆహ్వానపత్రం అందజేత


ఆహ్వానపత్రిక అందిస్తున్న వీడీసీ సభ్యులు

సారంగపూర్: మండలంలోని వైకుంఠాపూర్ శివారులో నిర్మించిన ప్రభుస్వామి(శివాలయం)ఆలయంలో ఈ నెల 15న నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని గ్రామ వీడీసీ సభ్యులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు చిన్నయ్య, నిర్మల్ దేవరకోట దేవస్థాన చైర్మన్ శ్రీనివాస్, ప్రభుస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోధనలో సాంకేతికత వినియోగించాలి

సోన్: బోధనలో సాంకేతికత వినియోగించుకోవాలని ఎంఈవో తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని మాదాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల సముదాయ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న వినూత్న మార్పులకు అనుగుణంగా తరగతి గదిలో పాఠ్యాంశ బోధన జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మామడ: మండలంలోని కమల్‌కోట్, కిషన్‌రావ్‌పేట్ పరిధిలోని జైత్యానాయక్‌తండా సమీపం నుంచి బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. ఇసుక నిల్వ చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. గోదావరినది, వాగుల నుంచి ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం గ్రామ శివారు ప్రాంతంలోని సుద్దవాగులో బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఇసుకను లోకేశ్వరంవైపు అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

కుంటాల: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎస్సై సీహెచ్.భాస్కరాచారి అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని విజయ సాయి పాఠశాలలో నిర్వహించిన సబ్ జూనియర్ అండర్–16 కబడ్డీ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్తే విజయం వరిస్తుందన్నారు. ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరుణ రమణారావు, నాయకులు దొనికెన వెంకటేశ్, జక్కుల గజేందర్, ప్రిన్సిపాల్ స్వప్న సంతోష్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, కార్యదర్శులు సునీల్, హేమలత, పీఈటీలు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న అందరికీ ‘ఉపాధి’

- డీఆర్డీవో విజయలక్ష్మి


నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లక్ష్మణచాంద: గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నర్సరీలను బుధవారం పరిశీలించారు. మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలోని నర్సరీలో పండ్లు, పూల మొక్కలతోపాటు డ్రాగన్ ఫ్రూట్స్ పెంచడంతో పంచాయతీ కార్యదర్శి ప్రియాంకరెడ్డిని అభినంధించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, మండల సమాఖ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల చేలలో ఫాంపాండ్లు, నాడెపు కంపోస్టులు పిట్లు నిర్మించాలని సూచించారు. ఈమేరకు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో రైతులు పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, టీఏలు దినేష్, భీమ్‌నాయక్, ఐకేపీ సిబ్బంది, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్యంలో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌టౌన్: భక్త రామదాసు 392వ జయంతిని పురస్కరించుకుని ఇటీవల భద్రాద్రిలో సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీల్లో జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో రెండోతరగతి చదువుతున్న శాన్విని, విద్యార్థిని తల్లిదండ్రులను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి నాగేష్, ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్ శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

ప్రజలు సన్మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: ప్రజలు సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీలో మాదచాల రుషి రామడుగు శివరామ దీక్షిత గురుపీఠం రాజయోగ ఆశ్రమం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఆశ్రమంలో ఎప్పుడు హరినామ స్మరణతో మారుమ్రోగే విధంగా భక్తులు చూసుకోవాలన్నారు.

నేడు ఇసుక వేలం


మాట్లాడుతున్న ఎస్సై, తహసీల్దార్

ముధోల్: మండల కేంద్రంలోని స్థానిక సాయి మాధవ్‌నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీఐ మల్లేశ్, ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో బుధవారం సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను తహసీల్దార్ శ్రీకాంత్‌కు అప్పగించారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు సీఐ, ఎస్సై ఆధ్వర్యంలో ఈ ఇసుకను గురువారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు గురువారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు రూ.10 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో అశోక్ వర్మ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం లక్ష్మణచాంద, మామడ, దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ) మండలాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఒకరోజు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇచ్చారు. ఎంఈవో అశోక్‌వర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

15న పుస్తకావిష్కరణ

భైంసాటౌన్: ‘తెలంగాణ ఉద్యమకారులు–ముధోల్ నియోజకవర్గం పాత్ర’ అనే అంశంపై రూపొందించిన పుస్తకాన్ని ఈనెల 15న ఆవిష్కరించనున్నట్లు పుస్తక రచయిత పుండ్లిక్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అలిశెట్టి నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే చికిత్స తీసుకుంటున్నాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బూక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, ప్రశాంత్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎంపీవో పర్యటన

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, సోమార్‌పేట్, బావాపూర్(కె) గ్రామాల్లో బుధవారం ఎంపీవో రత్నాకర్‌రావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టడంతో పాటు ప్రధాన రహదారి పక్కన, పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలను సంరక్షించాలని సూచించారు.

ఘనంగా భీమన్న పండుగ

సోన్: మండలంలోని మాదాపూర్‌లో బుధవారం భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు. భీమన్న దేవుని గదలకు గోదావరిలో స్నానం చేయించిన అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. వైభవంగా కళ్యాణం జరిపించారు. భక్తులు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండాన్ని దాటారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

సోన్: మండలంలోని కూచన్‌పెల్లిలో బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ కల్యాణాన్ని జోషి దామోదర పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి జలాలతో విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం మహా అన్నదానం చేశారు. అల్లం పెద్ద శివయ్య, అంగరి రాములు, భక్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 35వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బుధవార్ పేట్ హనుమాన్ ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ కర్ర పారిశ్రామిక సంఘం సభ్యులు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందజేశారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణం నిర్వహించారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు రాజశేఖర్ శర్మ, కీర్తి రాఘవ శర్మ, ఆలయ అర్చకులు నిమ్మగడ్డ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు సల్ల చంద్రహాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం ప్రత్యేక పూజలు చేశారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



నిర్మల్ నుంచి భైంసాకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద మొరాయించింది. దీంతో ప్రయాణికులు చేసేదేంలేక బస్సుదిగి వెళ్లిపోయారు. జిల్లా కేంద్రంలోనే బస్సు చెడిపోవడంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మొక్క నాటుతున్న కమిషనర్, ప్రిన్సిపాల్

ఖానాపూర్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు చేపట్టనున్న స్పెషల్ డ్రైవ్‌ను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై సాయికుమార్

సారంగపూర్: స్వర్ణ ఆశ్రమ పాఠశాల విద్యార్థినిని కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. నరేష్ మాట్లాడుతూ విద్యార్థినిని ఓ యువకుడు కిడ్నాప్ చేశాడని, సంఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. యువకుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, బీజేపీ నాయకులు సాగర్‌రెడ్డి, తిరుమలచారి, బడిపోతన్న, లక్ష్మణ్, శేఖర్‌గౌడ్, ఎల్లన్న, రాజు, మైస శేఖర్, శేఖర్, భీమలింగం, జగదీశ్, మల్లేష్, శ్రీనివాస్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం


జెండా ఆవిష్కరిస్తున్న డివిజన్ అధ్యక్షుడు

ఖానాపూర్: ఉద్యోగులు, కార్మికులు ఐకమత్యంగా పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ జిల్లా కార్యదర్శి పోచయ్య అన్నారు. యూనియన్ ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిర్మల్ డివిజన్ అధ్యక్షుడు వెంకటరమణ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డివిజన్ కార్యదర్శి మనోహర్‌స్వామి, నిర్మల్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, రాష్ట్ర నాయకులు కొరిపెల్లి శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


మాట్లాడుతున్న జ్యోతి

లోకేశ్వరం: బాల్య వివాహాలను నిర్మూలించాలని మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహ నిర్మూలన చట్టం 2006, సైబర్ క్రైం, హెల్ప్‌లైన్ నంబర్ల గురించి, ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, బాలికల సాధికారిత, చైల్డ్‌లైన్ సర్వీస్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో మౌనిక, శైలజ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మల్లయోధులకు కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

తానూరు: మల్లన్న దేవున్ని ఉత్సవాల సందర్భంగా ఎల్వి గ్రామంలో బుధవారం మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెందిన మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. విజేతలకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణ, బీజేపీ నాయకులు చిన్నరెడ్డి, గంగాధర్ పటేల్, బాపురావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్


బైండోవర్ చేస్తున్న కానిస్టేబుల్

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్, సుర్జాపూర్, ఖానాపూర్, గోసంపల్లె, బాదనకుర్తి గ్రామాలకు చెందిన 10 మంది గుడుంబా విక్రయదారులను బుధవారం ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ సుజాత ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ రంగస్వామి ఆదేశాల మేరకు కానిస్టేబుల్ రవీందర్, సిబ్బంది బైండోవర్ చేశారు.

మల్లన్న దేవునికి కల్యాణం



ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో మంగళవారం రాత్రి మల్లన్న దేవునికి కల్యాణం జరిపించారు. బుధవారం డప్పు చప్పుళ్లతో, బాజా భజంత్రీలతో చల్లనంబళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఆలయ ప్రాంగణంలో కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలకు నియోజకవర్గం నుంచే కాకుండా మహారాష్ట్రలోని ధర్మాబాద్, నాందేడ్, యావత్‌మాల్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల నుంచి మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.